క్లుప్తంగా

నేడు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

మెదక్ కలెక్టరేట్: మెదక్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్ల భర్తీకి ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవ అవసరాలు ముగిసే వరకు కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని గోకర్ణేశ్వర ఆలయంలో సోమవారం అర్చకుడు మహేశ్ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంచారు. కాగా దాత చిందోల్ నందకుమార్, సరిత దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయంలో శివుడిని దర్శించుకున్నారు.

ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న వెల్మకన్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని రాయగిరి వేంకటేశ్వరస్వామి జాతరకు రావాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి గ్రామ నాయకులు ఆహ్వానించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి కూడా న పత్రికలు అందజేశారు. ఈనెల 9 నుంచి 12 వరకు జాతర జరుగుతుందని తప్పక హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మాజీ సర్పంచ్ రాజేందర్, రాములు, రవిసాగర్ పాల్గొన్నారు.

ముగిసిన భూ లక్ష్మమ్మ ఉత్సవాలు



అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన భూ లక్ష్మమ్మ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబియ్యం వండి అన్నదానం చేశారు. గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భూ లక్ష్మమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సంమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పార్టీ బలోపేతం కోసం నియామకాలు



నియామకపత్రాలు అందిస్తున్న నేతలు

నర్సాపూర్: బీజేపీని మరింత బలోపేతం చేసేందుకే పట్టణంలో పలు పదవులకు నియామకాలు చేపట్టిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ పేర్కొన్నారు. సోమవారం పలువురు నాయకులను పట్టణ శాఖ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో పదువులకు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశారు. పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శులుగా రాంరెడ్డి, శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా నగేశ్‌గౌడ్, కార్యదర్శిగా ఓంకార్‌లను నియమించి నియామకం పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళీయాదవ్, ఆంజనేయులు గౌడ్‌లతో పాటు పార్టీ నాయకులు రాజేందర్, రమేశ్‌గౌడ్, సురేశ్, శంకర్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ ద్వారా ఎరువులు విక్రయించండి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ పుణ్యవతి

కౌడిపల్లి(నర్సాపూర్): ఎరువులను బయోమెట్రిక్ ద్వారానే విక్రయించాలని ఏడీఏ పుణ్యవతి డీలర్లను ఆదేశించారు. సోమవారం కౌడిపల్లిలోని మనగ్రోమోర్ ఎరువుల దుఖానాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాక్ పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఎరువుల డీలర్లు కచ్చితంగా బయోమెట్రిక్ ద్వారా మాత్రమే ఎరువులు విక్రయించాలని చెప్పారు. స్టాక్‌ను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ధరల పట్టిక, స్టాక్ వినియోగదారులకు కనిపించేలా బోర్డు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ స్వప్న పాల్గొన్నారు.

జాతరకు వేళాయే..

- ముస్తాబైన రాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం
- ఉగాది నుంచి నాలుగు రోజుల పాటు ఉత్సవాలు
- నాలుగు వందల ఏళ్లకు పైగా ఘన చరిత్ర కలిగిన ఆలయం



వెల్మకన్నలోని రాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం



ఆలయంలో కొలువుదీరిన రాయగిరి వేంకటేశ్వరస్వామి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని వెల్మకన్నలో ఉన్న అలివేలుమంగ పద్మావతి సమేత రాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం జాతరకు ముస్తాబైంది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో ఈనెల 9 నుంచి 12 వరకు నాలుగు రోజులు పాటు ఉగాది బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఆలయ భక్త భజన మండలి, గ్రామస్తులు తెలిపారు.

ఉగాది పండగ నుంచి జాతర

శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఉగాది పండగరోజు ప్రతిష్ఠించారు. దీంతో అప్పటి నుండి ప్రతీ సంవత్సరం ఉగాది పండగ నుంచి నాలుగు రోజులపాటు ఉత్సవాలు జరుగుతున్నాయి. ప్రతీ శనివారం భక్త మండల సభ్యులు రాత్రి భజనలు చేస్తారు. ఈనెల 9న ఉగాది పండగ సందర్భంగా ఉదయం శ్రీవారికి పంచామృతాభిషేకం, కంకణ ధారణ, అఖండదీపారాధన, ధ్వజారోహణం, సాయంత్రం బండ్ల ఊరేగింపు, రాత్రి గరుడ వాహన సేవ అనంతరం సాంస్క ృతిక కార్యక్రమాలు ఉంటాయి. 10న అభిషేకం, కుంకుమార్చన, పాచిబండ్ల ఊరేగింపు, అశ్వాహన సేవ, సాంస్క ృతిక కార్యక్రమాలు, 11న ఉదయం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, సాయంత్రం శ్రీవారి తిరు కల్యాణం, లంకదహనము, రథం ఊరేగింపు, 12న శ్రీవారి చక్రస్నానం, అభిషేకం పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అయ్యారి వంశస్తులే అర్చకులు

వెల్మకన్నలోని రాయగిరి వేంకటేశ్వరాస్వామి ఆలయంలో అయ్యారివారు ప్రత్యేక పూజలు చేస్తారు. వేంకటేశ్వరస్వామి గ్రామ అయ్యారి గూడంకు చెందిన భక్తులు కూచయ్యకు కలలో కనిపించి విగ్రహం ఉన్నచోటు తెలపడం, ఆలయం నిర్మించడం జరగడంతో అప్పటి నుంచి అయ్యారి వంశస్తులు పూజలు చేస్తున్నారు. ప్రభుత్వం సైతం ఆలయ అభివృద్ధికి సీసీ రోడ్డు వేయించింది. టీటీడీ సైతం కల్యాణ మండపం నిర్మించి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. భక్తులు చందాలు వేసి రేకుల షెడ్డుతో నీడ సౌకర్యం కల్పించారు.

రఘునందన్‌రావును గెలిపించాలి



నర్సాపూర్ రూరల్: చిన్నచింతకుంటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



అల్లాదుర్గం(మెదక్): అప్పాజీపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చిన్నచింతకుంటలో బీజేపీ ఇంటింటి ప్రచారం

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిన్నచింతకుంటలో మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలంటూ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోమవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి కోసం నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీకి ఓటు వేయాలని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిన్నారా మహేశ్‌గౌడ్, నాయకులు శంకర్, రాజు, బాలరాజు, మాధవి, నవీన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో బీజేపీకి మంచి స్పందన

అల్లాదుర్గం(మెదక్): బీజేపీకి ప్రజల్లో మంచి స్పందన ఉందని, మూడో సారి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి కావడం తథ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి అన్నారు. మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, రమేశ్, సాయిలుగౌడ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఏటీఎంపై అవగాహన



నస్కల్ గ్రామంలో మైక్రో ఏటీఎంపై అవగాహన కల్పించిన బ్యాంక్ అధికారులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఏపీజీవీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో మైక్రో ఏటీఎంపై అవగాహన కల్పించారు. ఈ మేరకు నస్కల్ గ్రామంలో ఏపీజీవీబీ బ్యాంక్ మిత్ర అవదుత మురళి వద్ద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ పాస్ బుక్ ప్రింటింగ్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మురళి కృష్ణ మాట్లాడుతూ.. గ్రామంలోనే బ్యాంకు సేవలు లభిస్తాయన్నారు. అదేవిధంగా అటల్ పెన్షన్ యోజన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సురెన్స్ హెల్త్ ఇన్సురెన్స్, స్కీమ్స్ సేవలు బ్యాంకు బ్యాంకు మిత్ర వద్ద సేవలు అందించబడతాయన్నారు. అలాగే పాస్ బుక్ ప్రింట్ తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐరిక్స్ ఛానల్ మేనేజర్ డీ వెంకటేష్, బ్యాంకు మిత్ర కేసరి రవి, తుమ్మల రమేశ్, నిజాంపేట బ్యాంక్ మిత్ర బృందం, గ్రామ్యస్తులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో చోరీ

నర్సాపూర్ రూరల్: పట్టణంలోని ధర్మశాలలో గల వీరభద్ర స్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ అర్చకుడు శివకుమార్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులను బద్దలు కొట్టి పూజ సామగ్రితో పాటు ఇత్తడి వెండి బిందెలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

ఉగాది పురస్కారం అందజేత



రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రముఖులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటకు చెందిన లయన్స్ సభ్యుడు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి ఉత్తమ రక్తదాతగా ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. మూడు దశాబ్దాలుగా రక్తదానం, అవయవ దానం విషయమై ప్రజలను చైతన్య పర్చడంతోపాటు పలుమార్లు రక్తదానం చేసినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో రెడ్డి గర్జన జాతీయ మాస పత్రిక ఎడిటర్ గుర్రం పాపిరెడ్డి, తదితరులు సన్మానించారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తప్పవు

వెల్దుర్తి(తూప్రాన్): వాహనదారులకు ఇబ్బందులు కలిగేలా రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ నవత హెచ్చరించారు. ఆమె మాట్లాడుతూ.. రోడ్లపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీ కొని ఆదివారం రాత్రి మండలంలోని మానెపల్లికి చెందిన రఘుపతి అనే వ్యక్తి మృతిచెందడం, పలువురు గాయాలపాలైయ్యారు. ఈ నేపథ్యంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని వెంటనే తొలగించాలన్నారు. లేనిపక్షంలో సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామన్నారు. కల్లాలు, ఖాళీ ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని, నిబంధనలు అతిక్రమించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

ఉగాదికి ముస్తాబైన దేవాలయాలు

కొల్చారం(నర్సాపూర్): తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం మంగళవారం ఉండడంతో మండలంలోని గ్రామ దేవాలయాలను ముస్తాబు చేశారు.

బగలాముఖీ ఆలయంలో అమావాస్య పూజలు



హరిద్వార్చన నిర్వహిస్తున్న పండితులు



హోమంలో పాల్గొన్న భక్తులు



అన్నదానం నిర్వహిస్తున్న వైశ్యసంఘం ప్రతినిధులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా పండితులు ఆంజనేయ శర్మ అమ్మవారికి హరిద్వార్చన, విశేష పూజలు, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేయడంతో పాటు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, నిర్వాహకులు సూర్యకుమార్‌గౌడ్, పోచగౌడ్, కొండల్, నాగరాజు, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

సోమావతి అమావాస్య పూజలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట హనుమాన్ దేవాలయంలో మహిళలు సోమావతి అమావాస్య పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేసి పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టుకు పూజలు చేసి, ప్రదక్షిణలు చేసి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని హనుమాన్ ఆలయం వద్ద అమావాస్య పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

శివ్వంపేట(నర్సాపూర్): రైతుల లబ్ధికోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. సోమవారం శివ్వంపేటలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కష్టించి పండించిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటించి అవసరం ఉన్న చోట్లల్లో ధాన్యం సేకరించేందుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. క్వింటాల్‌కు 2203 ధర కేటాయించినట్లు పీఏసీఎస్ సీఈఓ మధు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కిషన్, రైతులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులతో ఇబ్బందులు



నిరసన వ్యక్తం చేస్తున్న వాహనదారులు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డుపై నిర్మించతలపెట్టిన కల్వర్టు పనులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోతులబోగూడ నుంచి ఉసిరికపల్లి చౌరస్తా వరకు ఉన్న సింగిల్ రోడ్డుని డబుల్ రోడ్డుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనవి. పనులు దగ్గించుకున్న సదరు గుత్తేదారు కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించాడు. సోమవారం ఉసిరికపల్లి వద్ద కల్వర్టు నిర్మాణంలో భాగంగా పైపులు వేసేందుకు రోడ్డు పూర్తిగా తవ్వేశారు. దీంతో వాహనదారుల రాకపోకలు గంటల తరబడి నిలిచిపోయాయి. వాహనాలు వెళ్లేందుకు పక్క నుంచి మరోదారి ఏర్పాటు చేయాల్సి ఉండగా.. సదరు గుత్తేదారు పట్టించుకోకుండా పనులు చేస్తున్నాడని వాహనదారులు ఆరోపించారు. ఈ సందర్భంగా వాహనదారులు రోడ్డు పనులు నిర్వహిస్తున్న సిబ్బందితో వాగ్వాదానికి దిగడం తో పాటు నిరసన వ్యక్తం చేశారు. కల్వర్టు నిర్మాణ పనుల్లో ఇసుక ఉపయోగించకుండా రాతిపోడితో పనులు చేస్తున్నాడని పనుల్లో నాణ్యత కొరవడిందన్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టరాజ్యంగా పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ విషయం పై జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని పాంబండ, ఉసిరికపల్లి, పోతులబోగూడ గ్రామస్తులు తెలిపారు.

బర్మాస్వామి జాతరకు ఏర్పాట్లు పూర్తి



కొలువైన బర్మాస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పిల్లుట్లలో కొలువైన బర్మాస్వామి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా తెలుగు సంవత్సరం ప్రారంభం రోజున (ఉగాది) జాతర మహోత్సవం నిర్వహించడం ఆనావాయితీ. అందులో భాగంగా ఇక్కడ జాతరకు ఉమ్మడి రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. జాతరకు ముందురోజు చేరుకొని వంటవార్పు చేపట్టి మొక్కులు చెల్లించుకుట్టారు. ఈ సందర్భంగా బర్మాస్వామికి ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. స్వామివారికి బండ్లు, బోనాల ఊరేగింపుతో పాటు రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



దర్గాలో ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం పేటలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ మైనార్టీలకు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. రాష్ట్రయూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లానాయకులు సాగర్ షెట్కార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, నారాగౌడ్, దేవేందర్, రాజేందర్‌గౌడ్, గంగారెడ్డి, యాదుల్, సలీం, ఖాజా తదితరులున్నారు.

క్రోధినామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ



పెద్దశంకరంపేటలో పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న అర్చకులు, నాయకులు, అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ఉగాది సందర్భంగా బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం క్రోధినామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. నూతన తెలుగు సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు కిషన్‌రావు దేశ్‌పాండే, మండలాధ్యక్షుడు రామచంద్రాచారి, బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణశర్మ, రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షుడు గుడి చంద్రశేఖరశర్మ, ఖేడ్ ఉపాధ్యక్షుడు రాజేశ్వరరావు, సంఘం బాధ్యులు రాఘవాచారి, నాగరాజశర్మ, అనంతరాజశర్మ, ఫణికుమార్, రంగాచారి, రామాచారి, ఫణికుమార్, రవీందర్, సంగమేశ్వరశర్మ, రాము, గిరిధర్‌శర్మ తదితరులున్నారు.

రేలింగ్‌ను ఢీకొట్టిన ట్రాలీ ఆటో

- బూరుగడ్డ గ్రామస్తులకు గాయాలు
- బీఆర్‌ఎస్ సమావేశానికి వెళ్తుండగా ఘటన

కౌడిపల్లి(నర్సాపూర్): ట్రాలీ ఆటో అదుపుతప్పి రోడ్డు సైడ్ రేలింగ్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో పలువురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మెదక్, నర్సాపూర్ 765డి జాతీయ రహదారిపై మండలంలోని నాగ్సాన్‌పల్లి సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగడ్డ గ్రామానికి చెందిన సుమారు 20 మంది నర్సాపూర్‌లో జరిగే బీఆర్‌ఎస్ ఎంపీ సన్నాహక సమావేశానికి ట్రాలీ ఆటోలో వెళ్తున్నారు. నాగ్సాన్‌పల్లి సమీపంలో ట్రాలీ ఆటో అదుపుతప్పి జాతీయ రహదారిపక్కన ఉండే సైడ్ రేలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు కాగా, కాశబోయిన వెంకటయ్య ఎడమ కాలు విరిగి కింద ఊడి పడింది. బాధితులను నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వెంకటయ్యను హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ రంజిత్ కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బాధిత కుటుంబానికి సాయం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శుక్లాల్‌పేట గ్రామంలో నివాస పూరిగుడిసె దగ్ధమైన బిక్యానాయక్ కుటుంబానికి మెదక్‌కు చెందిన రవీందర్ నిత్యావసర సరుకులు, నగదును అందజేశారు. ప్రమాదవశాత్తునిరాశ్రులైన విషయాన్ని తెలుసుకొని తనవంతుగా నిత్యావసర సరుకులు, నగదును అందజేసినట్లు రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీపాల్, రాంచంద్రం పాల్గొన్నారు.

◆ పాఠశాలకు లేసర్ ప్రింటర్ బహూకరణ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని భాగీర్థిపల్లి ప్రాథమిక పాఠశాలకు బెస్ట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.25 వేల విలువైన లేసర్ ప్రింటర్‌ను బహూకరించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్‌కు అందించారు. ఈ సందర్భంగా బెస్ట రన్నర్స్ సేవలను కాంప్లెక్స్ హెచ్‌ఎం సాయిరెడ్డి అభినందించారు. ఈ ఉపాధ్యాయులు శివకుమార్, మహేందర్‌రెడ్డి, శివకుమార్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ ఇసుక ట్రాక్టర్లు సీజ్

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మెల్లూర్ హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నవత తెలిపారు. ఈ మేరకు వాహనాలతో పాటు యజమానులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా కుకునూర్ గ్రామంలో బెల్ట్ షాపుపై దాడిచేసి 2.76 లీటర్ల మద్యం సీజ్ చేసి, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇంటి యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు.

◆ పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సోమవారం ముందస్తుగా ఉగాది సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఉగాది పచ్చడి తయారు చేయించి, పంచాంగ శ్రవణం చేయించి ఉగాది ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ముస్లిం విద్యార్థులకు రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వివేక్, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, కృష్ణతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సోమవారం మండల కేంద్రంలోని సూరారం ఎక్స్‌రోడ్ వద్ద భాగిర్థిపల్లి గ్రామానికి చెందిన రాములు మెదక్ రోడ్డు నుంచి సూరారం రోడ్డువైపు మలుగగా, చేగుంట రోడ్ నుంచి వస్తున్న చందంపేట గ్రామానికి చెందిన హమాలి దుర్గేశ్ బైక్‌తో ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు

◆ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పాపన్నపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కొత్తపల్లి శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని అబ్లాపూర్‌కు చెందిన ముమ్మడి కృష్ణ (27) బైక్‌పై లక్ష్మీనగర్ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా కొత్తపల్లి శివారులో బైక్ అదుపుతప్పి కిందపడగా తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అతడిని 108లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య మమత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.